## సంక్రాంతి కథల పోటీలో రు. 500/- తృతీయ బహుమతి పొందిన కథ

# సాయంకాలం ఆరుగంటలు కావొస్తోంది.

క్షణక్షణానికీ బలం పుంజుకుంటున్న చీకటితో, కొనవూపిరితో వున్న వెలుగు-చివరి క్షణాల్లోకూడా, పట్టువిడవకుండా, పోరాడుతోంది.

ఆ రోజుకి-చీకటే గెలిచిందని, ప్రకటించినట్లుగా-సముద్రాలి కిళ్ళీబడ్డీలో గుప్పుమని లైటు వెలిగింది!

విజయగర్వంతో, రొమ్ము విరుచుకుని, రాజ్యం చేయడం మొదలెట్టింది చీకటి!

———సన్నపువీధి జంక్షన్‌లోవున్న ఆ కిళ్ళీబడ్డీలో లైటు వెలిగించిన సముద్రాలు-అరచేతిలో 'శ్రీరామ' చుట్టుకుని, ఆ అరచేతిని కళ్ళకద్దుకుని-కనకమహాలక్ష్మి పఠందగ్గిర అరటిపండొక టొలిచిపెట్టి, రెండు ఊదొత్తులు వెలిగించి ఆ అరటిపండుకు గుచ్చి, ఒక్క దండంపెట్టేసి-సర్దుక్కూర్చునే వేళకి——

"రొండుచుట్టలిలా పడీ యల్లుడూ—" అప్పుడేవొచ్చిన గురవులు బడ్డీ ముందున్న బల్లమీద చతికిలబడుతూ అన్నాడు.

"దీపంవెట్టీ యెట్టగానే వొచ్చేడుగుతావేటీ పెతీరోజూనూ! ఎన్ని సుట్లెలెప్పినా ఆ బుద్ది పోనిచ్చుకోవేటీ. అరువుకో ఏళాపాలా. నుంచీసెడ్డా నేదేటి గురవులు మాఁవా-సపా... మడిసికోమాటా...."

విసుక్కుంటూ, ఆ తర్వాత ముక్క మింగేసి, చిరచిరలాడుతూ చుట్టల్దీసిచ్చాడు.

విసుక్కోడంవూ, చుట్టలివ్వడంవూ, ఎంత మామూలో, ఆ మాటలనటంవూ అంతే మామూలు సముద్రాలికి. రోజూ జరిగే భాగోతమే అది. కానీ - యివాళ రోజూలా, గురవులు చుట్టతీసుకుని సముద్రాలు మాటల్ని దులిపేసుకోలేదు.

పదిపైసల బిళ్ళ గల్లాపెట్టిదగ్గర కడేలా విసురుతూ "అగ్గిపెట్టాదేయ్" అన్నాడు.

ఆ కొత్త రాకడ చూసి- విసిరిపారేసిన పది పైసలూ, ఇచ్చిన చుట్టలకో - అడిగిన అగ్గిపెట్టెకో - తెలుసుకోలేక తికమకపడిపోయి - అంతలోనె తేరుకుని-

"ఇసాపట్నం తిరగబడిపోది కవ్వలా వాయినా ఇయేలా! దీపంవెట్టీఎట్టగానే గురవులు బోణీ సెయ్యడం ఈ పదేనేల్లకీ ఇదే సూపు. సాల్సాల్లే - ఆ తాడెట్టి ముట్టించుకో - అగ్గిపుల్లోటి గండగేటి మల్లా ఇంకోటి బేరానికి-" అని, పది పైసల బిళ్ళని కళ్ళకద్దుకుని, గల్లాపెట్టెలో వేసుకున్నాడు సముద్రాలు.

"ఈ గురవులిసేతి బోణీతోటి యాపారాలు సేసి, నచ్చలు గడించేసి, మేడల్మీద మేడల్లేపేసి న్నాకొడుకు లెంతమందిలేరు ఈ ఇసాపట్నంల. ఆల్లోనా పాలడుగురలుడూ. మనసేతి కేపాటి వొటంవుందో తెలుస్తాది" చుట్ట ముట్టించుకుంటూ అన్నాడు గురవులు.


"ఇదుగో- కొట్టు కట్టేసి బయలెల్తాను—మరి నా కేటప్పనీ .... ముసిలోడు నోరిప్పితే మాటలకేటొస్తేన్నది- ఆట్టేవొక్క ఆబల్ల మేద తిన్నగ కూకుండూ, బేరాలొచ్చే ఎలయింది గానీ-" అంటోన్న సముద్రాలికి ఆదరా బాదరాగావొచ్చి బడ్డీ ఎక్కుతూన్న గౌరీసుని చూసేసరికి, వూరంత కోపం వొచ్చేసి—

"ఎర్రోరి గౌరీసు .... ఎంతయిందిర టైంవూ .... రోజూ ఆలీసంవేనేట్రా .... ఎట్టూ్సుంటే నాకోసం వొ సన్నట్టుందిర కొడకా .... అంత నీకక్కర్నెపోతే రాడం మానీరా..... నేనొ్నరెట్టుకోడంవే అవుపిసంది పెపంచకానికి.... ఇదుగో ఆకర్సారెపున్నాను-రేపట్నుంచయిదో గంటకిలా వొస్తేరా నేపోతేమానీ .. రోజూ ఏటీగోల నీతో—" అంటూ చిర్రుమన్నాడు.

ఈ చిర్రుబుర్రులు గౌరీసుకిమామూలే కాలరు మడతమీంచి మెడకు చుటుకున్న పువ్వుల రుమాలుతీసి దులిపేసుకున్నటు మలిపేసుకుంటాడు ఎప్పటికప్పుడు.

"ఇయేలరాత్రికీ ఎల్లంపేట పోస్టాపీసు జంక్షను కాడ రికాడ్డింగుడేన్సు ప్రోగ్రాం వుందిమావా... అక్కడ కొంత వైరింగు పనుంటేనూ, సూసుకొచ్చీసరి కాలీరంవైపోనాది మాఁవా...." అంటూ సర్దుక్కూర్చున్నాడు.

ఈ భాగోతం రోజూ చూస్తు నేవుంటాడు




పూర్తి పేరు: అల్లమూరు సూర్యవెంకట రమణారావు. చరిత్ర ప్రసిద్ధికెక్కిన 'విజయనగరం' స్వగ్రామం. 4-8-1943లో జననం. 1965 నుంచీ సాహిత్య వ్యాసంగం. సుమారు పాతిక ముప్ఫయి వరకూ కథలూ, "సుచరిత" అనే నవలా ఇంతవరకూ. యువ నిర్వహించిన 1980 చక్రపాణి అవార్డులలో కథ "పరిహారం"కు ద్వితీయ బహుమతీ, ఆ తర్వాత ఇదీ.

చాసో, చలం, శ్రీపాద, బుచ్చిబాబు అభిమాన రచయితలు. వృత్తిరీత్యా విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీలో ఉద్యోగం. ప్రవృత్తిరీత్యా విశాఖలో ప్రముఖ సాహితీ సంస్థ అయిన "విశాఖ సాహితి" లో కోశాధికారిగా సద్యోగం.

—ఏ. యశ్వీ. రమణారావు

కనుక గురువులు దాన్సంగతి పట్టించుకోకుండా, చుట్ట కాలుస్తూ వేరే ఆలోచనలో పడ్డాడు.




“ఏటి గు వుల్మావా.... ఏటియాల అయిడియా....?” అడిగాడు గౌరీసు-ఆలోచన్లోపడ్డ గురువుల్ని చూస్తూ-

“ఆ యిడియా లేటయితే నీకెందుకురా. నీకు తోచినంకెలేవో నువ్వేట్లకా.... ఏటలాగ కూకున్నావేటి దిమ్మతెక్కినాగ.... తియ్యి తియ్యి.... ఆ సార్డర్లు తీసి బయిటెట్టు.... ఆ బల్లమీదొటొడ్డీ....” సముద్రాలు మళ్ళీ కనుక్కున్నాడు. “ఏటియా లొక్క నాకొడుకూ రానేదూ....” మనసులోనే అనుకుంటూ, ఆరిపోయిన చుట్టని మళ్ళీ తాడుతో ముట్టించుకున్నాడు.

—————— ఇక్కడ ‘గురువులి ప్రతాపం గురించి మీకొక్కంత చెప్పాలి మరి —

విశాఖపట్టణంలో క్రికెటాట మొదలై సుమారు పాతిక ముప్పయి సంవత్సరాలు పెబడిందేవో అంతకు ముందునుంచీ వున్న ‘కాటన్ మార్కెట్’ ఆట రోజుల్నించీ - ఈ ఆటలో చెయ్యితిప్పి ‘గజాటగాడని గొప్ప పేరు మోసిన మనిషి. వొకానొక రోజుల్లో గురువులి పేరు వింటేనె క్రికెట్ కంపెనీ ప్రొప్రయిటర్లు హడిలి చచ్చేవారనీ ఆనోటా, ఆనోటా ఇప్పటికీ చెప్పుకుంటారు. ఆంధ్రదేశం నలుమూలల్నించీ ‘గజఆటగాళ్ళు’ సైతం గురువులి సలహాకోసం పరుగెత్తుకొచ్చేవారు ఆ రోజుల్లో. గురువులి ధాటికి తట్టుకోలేక పచ్చడయిపోయిన క్రికెట్ కంపెనీ షాహుకార్లు చాల మంది ఇప్పటికింకా బ్రతికేవున్నారు. అల్లిపురం నీలయ్యమ్మ వేపచెట్టు దగ్గరవున్న ఎత్తుమేడల్లాంటిగా ఆ రోజుల్లో గురువులు ఈ ఆటలో సంపాయించినవే. ‘గురువులు మేడలనీ వాటికిప్పటికీ సార్థక నామమే. ‘ఆ మేడలన్నీ కొట్టుకొచ్చింది ఆటలోనే’

అంటాడు గురవులిప్పటికీ-పాత ముచ్చట్లు చెప్పడం మొదలెతే. ఆ వెనకే "ఆ మేడలన్నీ కొట్టుకు పోయిందీ ఈ ఆటలోనే" అంటాడు నముద్రాలు వెక్కిరింపుగా. అంచాత ఆ మేడ లిప్పుడు గురవులివి కావు. ఎవరివో గురువులికి తెలీవు.



# ప్ర[illegible]తం

ఏ. యస్వీ. [illegible]

ఆ మేగల్లో కనీసం వొక్కటయినా మళ్ళీ సంపాదించి పేరు నిలబెట్టుకో లన్న ఆశ గురువులి వూపిరినిండా వుంది. అందుకే. మూడేళ్ళనుంచీ ఒకే అంకె 'కంటిన్యూ' చేస్తున్నాడు. ఆ అంకెకాని వొస్సేదానికింగ వరసగా మూడురోజులు అదే అంకె 'అన్ ఛేంజి' అయి తీరుతుందని గురువులికి గొప్ప నమ్మకం. అయితే ఈ మూడేళ్ళ లోనూ ఆ 'కంటిన్యూ' అంకె కొట్టనేలేదా? అని మీరు ఆశ్చర్యపోవచ్చు, పోకండి. కొటింది. కాని, ఆ కింద మూడు రోజులూ మాత్రం అదే అంకె 'అన్ ఛేంజి అవలేదు "అయితీరుతుందంటాడు" గురువులు. అందుకే ఘోరమైన తపస్సు చేస్తున్నానంటాడు. 'చార్టరు' మీద ఆ అంకేని నిలువుగా మూడు గళ్ళల్లో నూ చూసాక్కాని తన ప్రాణాలు పోవంటాడు. అందుకే. ఈ మూడేళ్ళలోనూ ఆ అంకె వొచ్చినప్పుడల్లా పావలాదో అర్ధదో అప్పటప్పట కొట్టినా వొచ్చింనంతా మర్నాడదే అంకెమీద గంపెడాశతో తిప్పేస్తున్నాడు.

అయితే-యిక్కడ మీకో సందేహం రావచ్చు-ఏంవనీ ?—

"ఈ గురువులని చెప్పబడుతున్న వ్యక్తికి ప్రసుతానికి ఏం ఆస్తీ పాస్తీలేనటూ, చుట్టలకిసైతం సముద్రాలి దయాదాక్షిణ్యాలమీద ఆధారపడుతున్నట్లున్నూ. చెప్పబడుతున్నాడుగదా- మూడేళ్ళనుంచీ వొకే అంకెమీద కనీసం పావలాన్నా ఆడటానికేవిటి మార్గం అతగాడికీ-" అని-

చెపాను—

గురువులికీ ఆటలో వుండుకున్నటువంటి అపారమైన ప్రజ్ఞా విశేషాలవల్లనయితేనేమి. అతనంకె ఆడేనే వొకానొక రోజుల్లో కంపెనీ ప్రొప్రయిటర్లు హడిలిపోవడం వల్లనయితేనేమి, ఫలానా సంవత్సరం ఫలానా రోజులో ఫలానా అంకెకింగ ఫలానా అంకె ఎలా కొట్టిందో అరటిపండొలిచి చేతిలో పెటినటు-చార్టరు వొలిచి ధీరీ చెప్పడంలో గల నైపుణ్యం వల్లనేమి. ఈ విశాఖపట్నంలో చాలామంది ఆటగాళ్ళకు. యితనిమీదకన్నా యితని అంకె మీద ఎనలేని గురీ-గౌరవంవున్నూ. వందల మీద ఆటలాడే వాళ్ళు కూడా ఇతని సలహా కోసం పరుగెత్తి రావటం ఇప్పటికీ ఎంత మామూలంటే - దీపం పెటీపెటగానే బోణీఅన్నా కాకుండా సముద్రాలు గురువులికి చుట్టలివ్వటం అంత మామూలు.

వూరికినే రోజూ చుటల్దారపొయ్యడానికి సముద్రాలేంవంత వెర్రిబాగులాడండీ ?

ఆ కిటుకేంవిటో ఎరుగుదురా?

చుట్టలడిగినప్పుడలా ఇచ్చేస్తూంటే గురువులు తన కొట్టొదిలి మరెక్కడికీ కదలడు గురువులెక్కడుంటే అక్కడికే ఆడేవాళ్ళందరూ రావటంవూ, రాలేనివాళ్ళు తమ మనుష్యుల్ని పంపటంవూ జరుగుతుంది. భగవంతుడెక్కడవుంటే అక్కడికక్కడే దండాలు పెటేసి తమ భకిని ప్రదర్శించుకునే భక్తులా - ఆ రోజుకి రాబొయే అంకె గురువులి నోట్లోంచి వింవినగానే ఆడేవాళ్ళు అందుబాట్లోనే వున్న సముద్రాలికొట్లో అంతో ఇంతో ఆడకుండా వెళ్ళలేరు కదా - అదీ.


అయితే- గురువుల్దగ్గర ఇంకో తమాషా వుంది చూశారా- అడగ్గానే, అంకె చెప్పేసి వూరుకోడు ఆ అంకె ఆరోజునే రావడానికి గల సవాలక్ష కారణాలన్నీ చెపాడు. చెప్పేసీ వూరుకోడు. చార్టరు విప్పి చూపించి- ఆ వేళ కొట్టబొయే అతనిచ్చిన అంకె. సంవత్సరంకింద అదే అంకె ఏ పరిస్థితుల్లో కొట్టిందో చాలా సహేతుకంగా చూపించి. ఆ పరిస్థితులన్నీ ఆ వేళ ఎలా ముంచుకొచ్చాయో, ముప్పయి ... డు సాక్ష్యాలతో సకారణంగా నిరూపిసాడు. చెప్పడంలో అతనికున్న గొప్ప ప్రావీణ్యాన్ని చూసినవాడు ఆ అంకెమీద ఆడకుండా ఆ రాత్రి నిద్దరోడు. అంకె చెప్పేసి. ధీరీ చూపించేసి. ఆడీమనీసి. వూరుకుంటాడనుకున్నారా ? ఛస్తే వూరుకోడు.

జబ్బుకి మందు చెప్పేసి డాక్టరూ, తగువుకి సలహా చెప్పేసి పీడర్లూ, చేతులు ముడుచుక్కూర్చుంటార్టండీ ? అయితే గురువులు తన ఫీజు ఆడేవాడ్దగ్గర్నుంచి అతి చాకచక్యంగా వొ లు చేసుకోవటంలో కూడా చాలా నిపుణత చూపిసాడు. ఎలా అంటే- ఆడేమనిషి ఆడగలిగే అర్హత బట్టీ. ఫలానాంత రాసీమని సముద్రాలితో ఆ మనిషి తరఫున తనే చొరవగా చెప్పేసి ఆ వెనకే అదె అంకెమీద తనకూ క్కడా, ఆడేమనిషి ఎంతవరకూ యివ్వగలడో వురమరగా అంచనాకట్టి అంతా రాసీమంటాడు. అంత గన్ షాటయిన అంకె తెలుసుకుని ఆడే వెధవలు ఆ మాత్రం మెర్సీ యెవడికోసం చూపించరని అతగాడి ధీమా ! గురువులు వెయ్యమన్నంతా కాకపోయినాకొంతయినా వెయ్యమంటారు సముద్రాల్తో.

ఆగండి-యిక్కడమళ్ళా, గురువులికీ, సముద్రాలికీ మధ్యనో చిన్న అండర్స్టాండింగోటుంది ! ఆడేవాళ్ళు గురువులికెంతంత వెయ్యమంటారో అంతా వెంటవెంటనే వేసీడు కంపెనీవాడు చీట్లకోసం వొచ్చే గడియో. క్షణానికో ముందు 'ఈ రోజుకి నీ లెక్క యిదిమాంనా" అని తెల్చి చెపాడు. అప్పుడు గురువులు వొళ్ళు విరుచుకుంటూ లేచి. తెల్చిన లెక్కలో యెక్కువ భాగం తన కంటిన్యూ నెంబరు మీద ఆడి కొంత ఆ రోజుకి బలంగా కనిపించే అంకెమీద ఆడి. ఆ మిగిలిన డబ్బు తీసుకుని బయలుదేరి పూర్ణాటాకీసు దగ్గరున్న మోతీ మహల్లో రెండు రొట్టెలూ ఒక్క చా పుచ్చుకుని. ఓపెనింగు అంకె వొచ్చేవరకూ వుండి తెలుసుకుని. తిన్నగా సముద్రాలి కొట్టుకొచ్చేసి. క్లోజింగుఅంకె వొచ్చేవరకూ తన వ్యాపకం సాగించి— సముద్రాలి కిళ్ళీబడ్డీముందు అదే బల్లమీద నడుంవాలుస్తాడు ఆ రోజుకి.

————ఇదీ—గురువులి ప్రస్తుత జీవితం.

——— "ఏటియాలొక్క సా కొడుకూ రాలేదు గౌరీసూ" ఇందాకొల్లా



స్వగతంగా అనుకున్న ముక్క బయట కన్నాడు గురువులు.

"సోంవ్వారం బిగినెస్సులగే వుంటది మాఁనా ఇయాల కొడే అంకె మీదే ఈ వోరఁనాటంతా బేసవుద్ది" అన్నాడు గౌరీసు సోడా కొట్టుకుని తాగుతూ వొచ్చి సర్వాత ఇప్పటికప్పుడే ఇది రెండో సారి సోడా తాగడం గౌరీసు. అది చూసి సముద్రాలికి వొళ్ళు మండుతూంటె—

"నాకో సోడా కొట్రా గౌరీసూ" అన్న గురువులి మాట విని, మరింత మండిపోవ డానికి బదులు సముద్రాలు ఆశ్చర్య పోయాడు। గురువులి నోట్లోంచి ఆ ముక్క తోపాటే చేతులోంచి ఎగిరొచ్చిన పది పైసల బిళ్ళ న్చూసి।

"ఏటిమాఁనా ఏట్నంగతి పది పైసల బిళ్ళ లొర్సం కురిపించే సన్న వియ్యాలా? కొంపతీసి ఏ పావలా అంకెగాని కొట్టేసేటి శనోరం సక్కొట్ట?" గురువులినేపు అనుమానంగా చూస్తూ అడిగాడు సముద్రాలు.

"ఛస్.... నీ కులుబుది పోనిచ్చుకున్న వుగా గల్లుడూ. నీకొట దప్పించి ఈ పదేళ్ళలోనూ మరే కొట్టోన్నా ఆడ్నట్టు గా ఎ. కూర్చున్దీరీ సెప్పినట్టుగానీ రుజూ పర్చుమీ- మరీ జన్మకి బ్రాకెట్టాణనికనక మాలచ్చిమిక్క దొట్టేస్సు కుంటను" అన్నాడు గురువులు నొచ్చుకుని.

నిజఁనేమరి - అలాటి దాఖలాలేం లేవు ఆ సంగతి సముద్రాలికి తెల్సు. ఊరికే అనుమానం తీర్చుకుందామని మాట విసిరే డంతే ఇప్పుడు గుండె నిబ్బరపడింది. అప్పసుమరి - గురువులిగ్గాని గాలి మళ్ళిమరే కొట్టు దగ్గరన్నా బెట్టాయిస్తే బిజినెస్సంతా టర్నయిపోదా? అయితే- గురువులికి గాలి మళ్ళుతూంటుం దప్పు డప్పుడూ. ఆ మళ్ళడం ఏ రాజమండ్రికో. బెజవాడకో గాని. విశాఖపట్నంలో మరో కొట్టుకి మళ్ళదు. గురువులి శాశ్వత చిరునామా కేరాఫ్ సముద్రాలి కిళ్ళీబడ్డీయేనని విశాఖ పట్నంలో బ్రాకెట్లాడే ప్రతి వొక్కడికీ తెలుసు. గురువులు బడ్డీముందు కూర్చో పోతే బడ్డీ వొక్కటేకాదు — సున్నపువీధి జంక్షనంతా వెలవెలా బోతున్నట్టుంటుంది. బ్రాకెట్టాటకి సెలవు రోజుల్లో గురువులి కడుపులాగే ఆ ప్రాంతమంతా ఖాళీగా వుంటుంది!

——————గౌరీసు చార్టరంతా క్షుణ్ణంగా పరిశీలించాక - వో పేద్ద నిటూ ర్పొదులూ, "మాఁనా.... ఇయాల ఆరు కూర్జైనా నూరు ఆరయినా గురువులామ్మఁవ కంటినూ్యి నెంబరు కొటితీరాల" అన్నాడు సముద్రాలితో. దినపత్రికలో బొమ్మని భూతద్దంలోంచి పరీక్షిస్తున్న గురువులు ఆ ముక్క వినగానే - కళ్ళలో కొటొచ్చిన మెరుపుల్తో గౌరీసుని చూస్తూ.

"నా మనసులోవున్న ముక్క బయట కనిసేవుర గుంటడా. నీ నోటి సలవాొల్ల నా నెంబరియాలగానొచ్చిందా - వొరె గౌరీసూ, నచ్చోరం దాకా సాట్టర్మీదింకో అంకె పడదని కాయపెట్టేసుకో, బెజవాడ మార్కెట్టు తలకిందులయిపోతాదనుకొరారే. కంపెనీ సావుకార్లు పంచలూడదీసుకుని



## తెలుగు పుస్తకాలు

| | |
|---|---|
| 150 కుటీర పరిశ్రమలు | రు. 10-00 |
| అతివినోద హాస్యకథలు | రు. 10-00 |
| కామసూత్రాలు | రు. 10-00 |
| దాంపత్య రహస్యాలు | రు. 10-00 |
| గర్భం-గర్భనిరోధం (బొమ్మలతో) | రు. 10-00 |
| ఇంగ్లీషు వైద్యం అన్ని రోగాలకి | రు. 25-00 |

4 పుస్తకములకు పోస్టేజి ఉచితం.

**ఉషా బుక్ సెంటర్,**

గాంధీనగరం, తాడేపల్లి గూడెం (A. P.)

# కాయకల్ప చికిత్స

ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెంట్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెంట్రుకలు నల్లబడును. చత్వారం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన పండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.

వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజరు

**శ్రీ యోగాశ్రమ్,**

పెదవాల్తేరు,

**విశాఖపట్టణము-17.**


ఇసాపట్నం రోడంట నరుగులెత్తాల—" అన్నాడారిపోయిన చుట్ట విసిరేసి కొత్త చుట్ట ముట్టిస్తూ.

ఈ ధోరణి సముద్రాలికి చిరాకు కలిగించింది.

"కాడితేకొట్టనీగానొరే గారీసూ, ఆ అంకెట్టకనువ్వ........ ఆదేవోలు కూడా ఆడరు. అన్నట్టొరే ఇయాల సోంవోరం కదా, కంపెనీవోణ్ణడిగినావురా ఏ చేటి కటింగులో ఎట్టమన్నాడో...." చిరాగ్గా అడిగాడు సముద్రాలు.

"కొత్తవేటీ కటింగులో ఎట్నేదుగానీ- ఇయాలొక్కరోజుమాత్తరం వాన్ క్లోజింగంకెలనిట్టికీ అరవయిరెట్లెట్టమన్నడు" అన్నాడు గారీసు ఖాళీ సిగరెట్టుపెట్టెనో పక్కకి కత్తిరించి, దానిమీదఅయిడియాలు దిద్దుతూ.

"మనకంకె బలంగున్నప్పుడే శనినా కొడుకులు రెటు తగ్గించేస్తార్రొరేగారీసూ. ఆళ్లు రెట్లు తగ్గించేసినకొడీ, మనకంకె బలమయిపోయికూకుంటది పీకలమీదికి" అన్నాడు గురువులు.

"ఆడు రెటు తగ్గించేస్తే, ఆదేవోడేం ఎర్రాడేటి? పావలా ఏసేబదులు అర్ధ ఏస్తాడు. అప్పుడేటయింది కంపెనీవోడి పనీ అంకె పలికితే?" అంటోన్న సముద్రాలి కల్లంత దూరంలో వాస్తోన్న శెట్టిగారు కళ్ళల్లో పడేసరికి- "రండి సెటిగారూ .... ఎనిమిద్దాటేగ్గా నొచ్చేవోరుకాదు ఏటియాల బేగొచ్చిసినారూ?" పలకరింపుతో కొట్టుదగ్గిరకు లాక్కున్నాడు.

"బలంవయినంకేదో వుందిగావాలియాలా" అన్నాడు గారీసు మర్యాదగా తనూ వోనవ్వు రువ్వేసి.

"అంతలావున్నావు పామంత్రం తెలీదా అన్నాట్ట వెనకటెవడో నీలాటోడే అయినా అంకె బలంగుంటె సరిపోద్దేటి కొట్టాలానీ...." అన్నాడు గురువులు పక్కకిజరిగి శెట్టిగారికి చోటిస్తూ.

"మా బాగన్నావు గురువులూ" అంటూ కూర్చుని :

"ఇవాళ సోమవారంవూ ముప్పయ్యో తారీఖూ కలిసొచ్చి పొద్దుట్నుంచీ బేరాలేకుండా చేసిసాయి. కొట్టుమీద కూర్చున్నాకూర్చునీ విసుగేస్సి మా చిన్నోణ్ణి కూరోబెట్టిలాగొచ్చేసాను. అయినా చూస్తన్నానుకదా .... ఎనిమిద్దాటాకొస్తే నీకు మాటాడ్డానికీ, రాయడానికీ సముద్రాలికీ తీరిక లేనంత రష్షు. అప్పుడేటాలోచిస్తాం? ఆదరాబాదరాగేదో టాదేసి వెళ్ళిపోడంవే అవుతోంది రోజూ. అందుకని యివాళ తీరుబడిగుందనొచ్చాను పెంగరాళే," అన్నారు శెట్టిగారు- అప్పంతా యెక్కిరావడంవల్ల మాటమాటకీ మధ్య ఆయాసపడుతూ

విశాఖపట్నంలో "ముప్పయిమూడు కొట్లు" అన్న పేరెప్పట్నుంచుందో సరిగ్గా తెలీదుగానీ అంతకు ముందునుంచీ తాత తండ్రులు సాగిస్తూ వొచ్చిన కిరాణా వ్యాపారాన్ని తన హయాంలో హక్కుభుక్తాలతో తీసుకుని ముమ్మరంగా వ్యాపారం సాగిస్తోన్న శెట్టిగారికి ముచ్చటగా మూడే మూడలవాట్లున్నాయి. వొకటి- వడ్డీకి అప్పులివ్వటమూ, రెండు-ఆదివారాలు క్రమం తప్పకుండానూ పండగలొ సే విధిగానూ పెద్ద స్టేకుమీద పేకాడ్డం, తుఫానొచ్చినా బ్రేకట్టాడ లేకుండా వుండలేకపోవడం మూడోదీనూ!

"తంవరొస్తేనేనుమాటాల్లేదనడంధర్మంవేనా శెట్టిగోరూ .. ఈ గురువుల్చెప్పినంకెలు ఎన్ని కొట్టలేదు తంవరూ," అన్నాడు గురువులు చార్టరు విప్పుతూ.

"కొట్టలేదన్నుగానీ .... ఈ మధ్దెన్నెల్లోజుల్నించీ వొక్క అంకేపలకలేదు.... మానేద్దాంవంటే ప్రాణంవొప్పకొడ్డంవవుతోందిగానీ.... ఆ వుషార్రావటంలేదు. సరిగ్గా చూసొకంకె చెప్పు ఇవాళ చాల్ను. అప్పలంద నుకున్న అప్పు బాపతు వొడ్డీ వొకటి ఈ నెలాఖర్రోజునొచ్చింది. ఎందుకొచ్చిందో అది. ఆ మొత్తంవలాగే ఆడేద్దాంవనొచ్చాను. ఏటయితే అదే అవుద్దని. తొందరలేదు... నిదానంగ చూసి చెప్పు గురువులూ...." అన్నారు శెట్టిగారు గారీసునో సోడా కొట్టమని.

"ఆ సేత్తోనె నాకోటి కొట్టరా గుంటడూ .... మా గొప్పదాహం గుందియాల...." అనేసి. గురువులు శెట్టిగారివేపు తిరిగి —" చూసారా తమాషా.... వొకే వొక అంకెమీద మొత్తంవంతా ఆడాలనొచ్చారుతవరు. ఇయాలనెసెప్పాలనుకున్నకీ వొకే అంకె. ఇయాలా అంకె కొట్టాలా. శెట్టిగారూ .... నచ్చోరం దాకా అదే అంకె సొట్టరీమదియాలే ఏసేసుకోండి .... నా మాటకేటి ధోకానేదు." అన్నారు గారీసు కొట్టిన సోడంత పవర్‌ఫుల్‌గా.

అప్పటి కప్పటికే సముద్రాలి బడ్డీ ముందు ఆదే జనం చేరి గురువులు చుట్టూ మూగేరు బెల్లం ముక్కచుట్టూ ముసిరే ఈగల్లాగు.

సముద్రాలికి మళ్ళీ చిరాకేసింది. అయితే - ఈసారి సోడా తాగుతున్నందుక్కాదు - ఆడబోయే జనాన్ని ఆడనీకుండా నిలబెట్టేసినందుకు.

"నచ్చోరం దాకా నంగశలాగుంచ్చి ఇయాలేటాడమన్నవో సెప్పరా .... సెట్లే బేగెల్లిపోవాల .... నీ కతలింటూ కూకో

దానికి మరో పనేచేసుకుంటన్నా వేటా బాబుకి ." అన్నాడు సముద్రాలు ఒరాగ్గానూ. శెట్టిగారిని వేగం డిస్పోజ్ చేసేదామన్న సదుద్దేశంతోనూ.

ఆ రోజుకి జరిగే యావత్ వ్యాపారం అంతా ఆరుగంటల్నుంచీ తొమ్మిది గంటల్లోపు జరిగిపోవాలి. ఒక్క చూపులో ఆ వేవాళ్ళనాకట్టుకోవాలి. ఒక్క మాటతో పావలా ఆడేవాణ్ణి అర ఆడేట్టు చెయ్యాలి. మాట్లాడూనె రాయాలి. రాస్తూనే అవతలి వాడితో మాట్లాడాలి. ఆడేవాడి బుర్రలో వున్న అంకెలకీ విలువివ్వాలి రూపాయలాడే వొక్కడికోసం పైసలాడే వాళ్ళని పదిమందిని వొదులుకోకూడదు. ఎన్నున్నాయని ఈ వ్యాపారంలో. అనిట్నీ మూడే మూడు గంటల్లో చక్కబెట్టుకోవాలి——అని సముద్రాలి తపన ఆత్రుత... చిరాకు. గురు అంతా నిదానం ఆడేవాడి బుర్రకి అంకె నెక్కించటం చాకచక్యమైన విద్య. ఆడేవాడికి గురి కుదిరేగాని చెప్పిన అంకెమీగ ఆడడు అంతా విని పావలా రాయించేసి వెళ్ళిపోయేవాడిని పట్టుకూర్చోబెడు. పావలా ఆడినా పదిపైసలు తనకూడా రాయమనేవాడి నొకలడుమళ్ళీ పదిమందీ చేరిన... చెపేనె అందం. ఒక్కొక్కడికీ చెపటమంటే మాటలూ గాదు ... వుండదు. పదిరూపా ... లాటగాడిని ... చెపితే పక్కనున్న చిన్నాచితకాళ్ళకీ హుషారు పుడుతుంది కదా————అదే గురువు లా... చనా విధానం! అందుకే———

"...రి సూచించమంటారా... అంకె చెప్పమంటారా?" ...గా అడుగుతూ రంగంలోకి దిగేడు గురువులు.

"నువ్వు చూపి... మాత్రం ఆ అంకెల గారడీ నాకు అర్థమయి చస్తుందేవిటి? తీరీ గాడ్డానికి బాగానే వుంటుందిగాని అంకెలు కొట్టడానికికాదురే గురువులూ... తీరీలూ గీరీలూ చూడ్డమెందుగ్గానీ. అంకె చెప్పిద్దూ" అన్నారు శెట్టిగారు కానీ—చుట్టూ మూగిన జనానికి ఆ థీరీ ఏవిటో వినాలనేవుంది- మానసికంగా వో ధైర్యం కోసం!

"అమ్మమ్మా! అలగనేస్తే ఎలగండీ తీరీనేకంతా బెజాడోడు వొక్క అంకె తియ్యనేదియాలివారకూ- సార్టర్ మొతం మీగ ఏ అంకెనన్నా పిలిచి, నువెలాగొచ్చావనడగండీ... ... ...కాలోసహా అది థీరీ సెప్పపోతే నానె వి గోయించుకు పోతాను మరి మీరు తీరీనేదంటే ఎలా కుదురద్దీ?" అన్నాడు గురువులు—ఛార్టర్లో వంవత్సరం వెనక అంకెలదగ్గర చూపుడు నిలబెట్టి.

రోజురోజుకి పెరిగే ఎండాకాలపు ఎండలాగ- సముద్రాలికి క్షణ క్షణంకీ చిరాకు




# రాఘ్వాల్®
(పైపూతకు మాత్రమే)
తామర, గజ్జి, దురద, యిస్తరు, తొడలయందు దురదకొట్టులు అరికాళ్ళు, అరిచేతులు, వరుపులు, పేసుటుట, మొస్సను.
అన్నిపావులయందు లభించును
చర్మవ్యాధులకు,
తయారు:- శ్రీ రామ ఆయుర్వేద నిలయం (Regd)
కత్తిపూడి (వయా) చేబ్రోలు తూ॥గో॥జిల్లా (ఆం॥ప్ర)

శ్రీకాకుళం, విజయనగరం, వైజాగ్, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలకు మినహా మిగతా జిల్లాలలో స్టాకిస్టులు కోరబడుచున్నారు.



సంక్రాంతి శుభాకాంక్షలు!

# రాధా సిల్క్స్

పట్టు చీరలు ప్రత్యేక షోరూమ్

A.V.N. కాలేజిడౌన్, బస్టాప్‌వద్ద (సూటుకేసుల షాపుకి చేర్చివున్న సందులో)
మెయిన్ రోడ్, విశాఖపట్నం 1.

"ప్రతీ మహిళకో పట్టుచీర" ప్రోగ్రాంలో చేరి పట్టుచీర పొందండి.



## మీరు కూడా పారిశ్రామికవేత్త కావచ్చు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి, పెద మొత్తాలలో అమ్మకం జరిగే శ్రేష్ఠమైన ఉత్పత్తులయిన 1) టాల్కం పౌడరు 2) అగరబత్తి 3) పండ్ల పొడి 4) నెయిల్ పాలిష్ 5) ఐటెక్స్ మొదలైన నాటి తయారీ విధానంగా యివ్వబడిన పుస్తకం కాపీ ఒకటికి ధర రు. 4-50 మాత్రం. మనిఆర్డరు పంపండి. పోస్టేజి ఉచితం పుస్తక విక్రేతలకు 30% కమిషన్.

జలీనాడ్స్ (Zaleenads)
8, జకరయ్య కాలనీ, ఫస్ట్ స్ట్రీట్, మద్రాసు—600 094.
ఫోన్ : 420804.



## నెలకు రు. 20/-లు సులభ వాయిదాపై



ప్రసిద్ధి చెందిన ఎకో- మిక్సర్- కమ్ గ్రైండరు రు. 480/- భారతీయ అవసరాలకోసం ప్రతి ఇంట్లో వంటగది కొరకు 2 సంవత్సరాలు గ్యారంటీ. ఎకో—బాబిన్ త్ర్యాండ్ల ఎ.సి.-కమ్-బ్యాటరీ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్ కూడా లభించును. ధర రు. 280/- లైసెన్స్ లేదు. మరియు ప్రఖ్యాతి చెందిన ఇండియన్ రిస్ట్‌వాచీ ధర రు. 260/-.

ECHO RADIO & TRANSISTOR Co (AJ)
P. Box No. 9441, Delhi—51.

మన్నికకు ప్రసిద్ధిచెందినవి

అశోకా పెన్స్ & బాల్ పెన్సు

REGD. No. 143646

అశోకా పాళీలు లాంగ్ లైఫ్ పాయింట్లతో తయారు చేయబడుచున్నవి

అశోకా పెన్ వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)

తెల్ల వెంట్రుకలుండవు

హెయిర్ డైతో కాదు. వెంట్రుకలు పండి బడిన మా ఆయుర్వేద తైలము తెల్ల జుట్టును నిగనిగలాడే నల్ల జుట్టుగ చేస్తుంది. ఇది మెదడుకు, కళ్ళకు టానిక్కు. ఒకసారి వాడి చూడండి. మీరు పూర్తిగా సంతృప్తి పొందుతారు. వెల రు. 10/-పూర్తి కోర్సు రు. 26/- పోస్టేజి అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SANJIWANI AUSHADHALAYA
P.o. Katri Sarai (Gaya)

ఉచితము! ఉచితము!

తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు ఐదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.

Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్

టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700, 1010.

SUVARNA

పెరిగిపోయి మంట పుట్టించేసోంది పైము చూసే ఆయన్నం వాసోంది. ఇంకా బోణీ కాలేదు చూస్తే. శెట్టిగారి ప్రతిబోణీ మంచి దనుకుంటూంటె ఆడ్డం అవుపడలేదు వొచ్చి పావుగంటయినా.

"వొయ్నువ్వు తీరీ వాపించీసరికి వోపి నింగొచ్చి కూకుంటద్దానీ. అంకె సెప్పీరా, శెట్టిబాబాదేసెలిపోతారూ..." అన్నాడు సముద్రాలు 'బోణీ కోసం ఆదురాగా.

"అంకెచెప్పీ గురువులూ.. కొట్టుదగ్గర మా రెండోకుర్రాణ్ణి కూర్చోబెట్టొచ్చాను. నాడికి బేరం ఒగకన్నా రోడ్డుమీదొచ్చి పోయే గుంటలమీదే దృష్టెక్కువ" అన్నారు శెట్టిగారు- కొట్టునీ, బేరాన్ని, రెండోకుర్రాణ్ణీ కళ్ళల్లో కొకేసారి తెచ్చుకుని.

ఆ మాటకి - చుట్టూ మూగిన జనం ఫక్కాల్న నవ్వేరు.

"పెల్లి సేసియండ్రెట్టిగోరూ. కుదురుగ్గుంటాడూ" జనంలోంచి వో పోకిరీగాడన్నమాటకి మళ్ళీ నవ్వేరు.

"ఇయ్యాల అంకెకె తీరీ ఎంతబలంగుందో సెప్పలేను శెట్టిగారూ. అదలా గుంచండి. మరో గొప్ప సంగతుంది... అదిగాని సెప్పే......" అంటూ ఆగిపోయాడు గురువులు.

"సెప్పే అంటూ ఆగిపోనావేటీ.... నువ్వు సెప్పిందేదో ఇందాకవనేకదా ఈ జనమంతా నీ సుట్టు సేరిందీ.." అన్నాడు గారీసు - సస్పెన్సు భరించలేక

గురువులు సముద్రాలిని అడిగి వో చుట్ట తీసుకుని. ముట్టించి గట్టిగా వో దమ్ము పీల్చి, శెట్టిగారి వేపు చూస్తూ; కిందటేడు కార్తమాసముందు రోజు మీకు గుర్తుందో లేదోగాని. రీడింగు రూముకాడ మీరెదురయి ఇయ్యాలంకేటి గురువులూ" అనడిగినారు.... మొగలెట్టిన గురువుల్ని చూసి సముద్రాలికి మండుకొచ్చి - "ఆ బాబు రోజూ అడుగుతారు నిన్ను అంకెలేటనీ. కిందటేడు కార్తమాస.... ఆ కిందటేడు దీపాలమాస ముందు రోజు నువ్వు సెప్పిన అంకెలన్నీ గుర్తెట్టుకుంటారేటి.... అంకె సెప్పమంటే కతల్సెప్తాడు కతలాన...." అని చిరాకుపడ్డాడు జరుగుతోన్న జాప్యాన్ని, ఆడకుండా మూగుతోన్న జనాన్ని చూసి

గురువులు సముద్రాలి మాటల్నే విని పించుకోలేదు. అతని మొహం ఓ గొప్ప సన్నివేశాన్ని చెప్పబోయే పులకరింపుతో వెలిగిపోతోంది- గుప్పుగుప్పుమని వెలిగే అతని నోట్లో చుట లాగే గుండెల్నిండా ఓ దమ్ములాగి మళ్ళీ ప్రారంభించేడు

"సరిగ్గా మీరడిగిన ఆ రోజు తెల్లార్తూ వున్నాకు-రాజేశ్వరీ టాకీసు దగ్గిరంగులో పన్నెండో నెంబరు బస్సు యిలక్ట్రా దిగబడి పోయున్నట్టు కలొచ్చింది అదె నిజమైతె అయేలంకె కూడా అదే నను కుంటూ లెగిసి కాలేసి డవున్‌కాడకి టీ తాగుదా రనొచ్చేతలికి- టీకొట్టు అప్పలాజు "గురూ పన్నెండో నెంబరుబస్సు బోల్తాపడి అక్కడికక్కడే ముగ్గురు చచ్చిపోనారంట" అని యేడియేడి టీతోపాటు యేడేడి నూసందించీసరికి—నెంబరు కాయపెట్టీసాను. రీడింగురూముకాడ మీకదే నెంబరు సెప్పినాను. కొత్తమాసవాడు టూరెన్నొచ్చి కూర్చుంది. ఏరికినేదా ... సరుగున కొట్టుకాడొచ్చి "ఏం శెట్టి బాబూ యెంత' నడిగేసరికి "రెండ్రూపాయల్ల" న్నారు నీరసంగా మొహంపెట్టి సెపొచ్చినా పేణం వుసూరమంది ...' అని ఓ క్షణం ఆగి సముద్రాల్ని చుట్టడిగాడు.

ఆ భోగట్టా వినగానే శెట్టిగారికి ప్రాణం వుసూరమంది ఇప్పుడు.

చుట్ట అడిగినందుకు సముద్రాలికి విసుగు రాలేదు సరికదా ఆసక్తి ఎక్కువయింది.

చుట్టూ మూగివున్న జనం చెవులు రిక్కించి వున్నారు.

అందులో ముందున్నవాడికి పెద్ద హుషారొచ్చేసి. చేతిలో వున్న చార్మినార్ సిగరెట్టు పెట్టి. అగ్గిపెట్టీ గురువులికందిస్తూ "సిగిరెట్టు కాల్చు మావా" అన్నాడు బలవంతపెడ్తూ.

భక్తుల సరదాలకి ముచ్చటపడే భగవంతుడిలా - చిరునవ్వుతో సిగరెట్టు ముట్టించి వొక్క దమ్ముతో దాని బతుకు సగం కడతేర్చి - అందరి వంకా వోమారు ప్రసన్నంగా చూసిన తర్వాత శెట్టిగారి వేపు చూసి—

"దాన్నిగదరగ ఇయాల్తెల్లార్గాం వున్నూ కూడా సరిగ్గలాటికలేవొచ్చికూకుంది." అన్నాడు గురువులు.

శెట్టిగారికి ఊపిరి బిగుసుకుపోయింది.

"దానల్లిసిగ్గోసిరి కిలో బస్సు నెంబరవుపళ్ళేదు" అన్నాడు గురువులు.

గాలి తీసిన బుడగలా బుస్సుమని పోయారు శెట్టిగారు.

"ఇయ్యాలిక తెంవల్లుకావుల్లానాయనా" అని లోపలోపల్లోపలే సణుక్కున్నాడు సముద్రాలు.

మూగిన జనం తమ ప్రాణాలన్నిటిని గురువులు మీదే పెట్టుకూర్చున్నారు.

"ఉగయం లెగిసినాకడ్నుంచి పన్నెయ్యి బుద్దవలేదు. నెంబరందినట్టే అంది దూరమయిపోనాదేటాని కాలూ సెయ్యీ ఆడకండా గింజుకున్నాను. మద్దే

నేనిలా సూయజ్‌పారం టర్నింగులో ఎడ్డ బండిస్తుదుకుని పదమూడో నెంబరు బస్సు బొమ్మర్లా తిరగబడి పోనాదనిన్నా గ్గాని వొచ్చిన కలకర్థనేంటో బోదపశ్నాది కాదు. తిన్నగొచ్చిచ్చి నా కంటినూ నెంబరయి కూకుంది చూశారా తమాషా. సార్టర్లో కెల్లి చూశాను ఎలాగెల్లి సూసినా ఆ అంకెతప్ప మరోటేదీ కనపణ్లేదు. సాలా బలంగుందంకె సార్టరో. అగ్గిమీద గుగినంనాగ కలొటొచ్చి కూకుంది. జోస్యం జెప్పినటు కలకాస్తా మదే నేనికలా నిజంవయిపోనాది. అరిమీద గిరిపడ్డా గిరి మీన అరొచ్చిపడ్డా ఇయాల త్రీవొన్నొచ్చి తీరాల ..." ఖచ్చితంగా అని, ముగించేడు గురువులు.

మాంసంముక్క వాసన తగలగానే పరిగెత్తే కుక్కల్లా- అంతవరకూ గురువులు చుటూ మూగిన జనం గిరుక్కున వెనక్కి తిరిగి గారీసు చుట్టూ చేరారు.

వాళ్ళంతా అణాకానీ ఆటగాళ్ళు.

వాళ్ళని సముద్రాలు పటించుకోడు

గురువులప్పలు కేర్ చెయ్యడువాళ్ళని.

ఇద్దరికళ్ళు శెటిగారిమీద వున్నాయి.

"కవరిం గేటాడమన్నావయితే?" అడిగరు శెట్టిగారు పూర్తిగా ధైర్యం చిక్కక.

"ఏంవాడినా నష్టంవే" అన్నాడు గురువులు తనమాటకి మరి తిరుగులేదన్నట్టు.

"శనివారం వన్‌త్రీ వొచ్చిందికదా. ఇవాళది తిరగబడిపోతుందనీ ...." శెట్టిగారికి గుండె పీకటం మానలేదు.

"ఉదయం నుంచీ తిన్నగ తిరిగిన బస్సు తిరగబడిపోద్దని ఎవరన్నా కలకాస్తే రేంటి. నేను కాసేను. దాని కేటంటారు? మీరు తీరీ సూపించొద్దన్నారన్సూపించలేదు. సూపించీమంటారా. శనోరం వొన్‌త్రీ రాకపోతే కలొచ్చినా గిలొచ్చినా త్రీవొన్ కియాల బలంనేదసలు. ఆ సంగతొక్కటి సార్టర్లో సూపించినానంటే ఆర్థానికి మీ జోబీలో డబ్బుసాల్దు" అన్నాడు


రీటా మీ కేశ సంపదకు



జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తీ, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికీ, చల్లదనానికీ, దానికదే సాటి.

రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.




రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును

స్త్రీలూ పురుషులూ వాడుతున్నారు

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు
★ఫుల్‌వాయిల్, ఆఫ్‌వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, 2×2 రుమాలు
★స్కూలుయూనిఫారంలు ...వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట ....... విజయవాడ-2.

పెండ్లికి ముందు, తర్వాత



నరముల బలహీనత, శుక్ల నష్టము, శీఘ్ర స్ఖలనము, ఇతర సెక్స్ సమస్యలకు పోస్టుద్వారా చికిత్స కలదు. వివరాలకు 50 పైసల స్టాంపులు పంపండి.
డాక్టర్ బాబా L A M S V.V
Asst డాక్టర్స్
A. సర్దార్ R.M.P.V.V.
A. యబాల్ R.M.P.V.V.
బాబా అండ్ కో ఆస్పత్రి,
తాలూకా ఆఫీసు ఎదుట, విజయవాడ—3.

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

ఉచితము! ఉచితము!
తెల్ల మచ్చలు
అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మం మామూలు రంగు పొందును. ప్రచారం నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.
Krishna Chandra Vaidaya (AJ)
P. o Katri Sarai (GAYA) INDIA

గురువులు కొత్త చుట్టొకటి ముట్టిసూ.

"అంతగటిగుంటె ని మాటేగానీ. కొత్తమాసపూటా నీచేత తిటెవడు తింటాడు. కింద ఏడయింది చాల్దా" అన్నారు శెట్టిగారు.

"సెప్పినర్వాతా.... ఆ అంకొచ్చినాకు నర్వాతా.... ఆడ్నేడంటే తిటక సంకెక్కించుకొమంటారేటయితే. శనోరం వొన్‌త్రీ రావాల - సోంవ్వారం కత్తిరగబడాలా.... నచ్చోరం దాకా అన్సేంజవాల... దానోక్కసం కదా కాసుకూక్కున్నాను మూడేల్ల నుంచీ.... సూడండి నా కొడుకుల్నోని ఆటాడించేసాను. నచ్చోరం త్రీవాన్‌కి పాతిక రెట్టెట్టపోతే నా సెవి గోయించుకుంటాను" అంటున్నప్పుడు గురువులి కళ్ళలో వెలిగిన వెలుగు చూసి-

"మూడేల్లబట్టీ యింటనానుగానీ శెట్టిబాబూ మా మావ మాటల్లో ఈ రోజగుపించే ఎలట్రిటి పవర్నాటి పవరు నానెప్పుడూ సూళ్ళేదంటే నమ్మండి. మలా కవరింగు లెందుగ్గాని ఈ అంకెమీ నెంత రాసీమంటారో సెప్పీయండి బేగి ...." అన్నాడు సముద్రాలు.

గురువులి మాటలకే శెట్టిగారికి అగిలా అంటుకున్న ఆశలో సముద్రాలి మాటలు నెయ్యిలాపడి నమ్మకం మరింతగా రాజుకోవటంతో వుక్కిరి బిక్కిరయిపోతూ...." పాతిక రూపాయలాసీ" అన్నారు. ఆ రోజు అనుకోకుండా వొచ్చిన వొడ్డీలో ఒక్క రూపాయికూడా మిగల్చనంత ధారాళంగా.

"ఆ సేత్తోనే నాకో మూడ్రూపాయలాసీయలుడూ శెట్టి బాబిచ్చేస్తారు" అన్నాడు గురువు లంతకన్నా ధారాళంగా. అంటూ గారీసు దగ్గర అర్ధరూపాయాట ఆడేసి పారిపోతున్న ఓ శాల్తీని చొక్కాపట్టుకు నాపి రెండు సిగరెట్లు వొడికేసి వొకటి నాడగి పెట్టెతోనేముట్టిస్తూ శెట్టిగారివంక వో చూపు వుంచాడు.

శెట్టిగారికి ప్రాణం పీకేసింది. తను ఆడీసిన పాతికరూపాయలూ ఉల్నాగా వొచ్చినవి. గురువులు రాయమన్నది రాస్తే అది తన కష్టార్జితం. పైగా ఇప్పుడద మూడు రూపాయలే - తెలారీసరికి నెంబరొచ్చి కూర్చుంటే అది నూటా ఎనభయి రూపాయలై కూర్చుంటుంది. అప్పుడు ఎంత ఉసూరమంటుందీ ప్రాణం? శెట్టిగారి తాత్సారం జూసి—

"ఏటి శెట్టి బాబూ! గురువులికెయ్యమంటారా?" అనుమానంగా అడిగాడు సముద్రాలు.

"వెయ్యమని" — "వెయ్యాపోతే బూతుల్తిట్టకుండా వొదుల్తాడా గురువుటూ"—అన్న ముక్క గొంతులో నొక్కేసుకుని—అంటూ; ఎగస్ట్రాగ్గా మూడు రూపాయలూ కలిపి ఇరవయ్యెనిమిదీ తీసిచ్చి లేచారు శెట్టిగారు

శెట్టిగారి పిసినారితనానికి చిరునవ్వు నవ్వుకుంటూ రోడ్డువేపు చూస్తోన్న గురువులి గెద్దచూపులో కోడిపిల్లలా చిక్కుకున్నాడు అప్పుడే రిక్షా దిగుతోన్న చందూలాల్.

"ఆయియే లాల్జీ" అన్నాడు గురువులు శెట్టిగారిని వొదిలిపెట్టేసి

విశాఖపట్నంలో ఇటు ఏరాడకొండ దగ్గర్నుంచి అటు గాజువాక, అలటు అక్కయ్యపాలెందాకా, ఇలిటు సదిలపాలెందాకా- చందూలాల్ హోల్‌సేల్లోగానీ, రీటైల్లోగానీ చెయ్యని వ్యాపారంలేదు. అసలని వొసువులేను పాతికేళ్ళక్రితం విశాఖపట్నం సూదిలావొచ్చి దబ్బనంలా కూర్చున్నాడు! బ్రాకెట్టు కంపెని నడపి బాగా బాగుపడే సమయంలో తెలివిగా మానేసి ఆ 'బాగు'ను మరో వ్యాపారంలో వినియోగించి మరింతగా 'బాగు' పడిన చాలా కొద్ది మందిలో చందూలాల్ మొదటివాడు అయితే ఆటమీద విశ్వాసంపోక ఇప్పటికీ ఆడుతూ వుంటాడు. గురువులి సలహామీద గురి.

"ఆజ్‌కీ క్యానంబర్ గురువుల్బాయీ.... షనివారమ్ వొకటీ ఆరు సెప్పినావ్— మూడొచ్చింది మా పీకలీ దిక్క వోపినింగు ఎభయిరూపాయల్వేయబడే కొంతు షారూ అయింది మాకి-" అంటూ వొచ్చాడు చందూలాల్ ఆడింది రెండువందలూ గెలిచింది నాలుగువందలూ అయినా.

"శనోరం మూడురాకపోతే ఇయాల సాట్టరీమ్మద నెంబరేనేదు లాల్జీ... ఇయాల త్రీవాన్ గన సాట్ నెంబరు లాల్జీ... ఎంతయినా ఆడీయండి.... మరేటీ ధోకా నేదు.... తెలారానెంబరు సూస్సి నచ్చోరం దాకా అదే నెంబరు కల్లుమూసుకు నాడేయండి... ఎన్ని యాపారాల్చేస్తె మాతంటటి లాల్జీ ఒక్క నెంబరు కొడితే వొచ్చే నాబం ముందు .... ఆలోసించకుండా ఆడీయండి ..." గుక్క తిప్పుకోకుండా పాఠం వొప్పచెప్పినట్టు చెప్పేసాడు గురువులు.

ముందూ, వెనక లాడుతున్న చందూలాల్‌ని చూసి—

"ఏటి నమ్మకంనేదా నా మాటల్లో.... అయితే యిలగరండి లాల్జీ సాటరూపిస్తాను.... అప్పుడు నమ్మదురూ..." అన్న గురువులు మాటతో—

"సరేభాయి నీ మాట కాగనగలమా.... కానీ... సముద్రాలూ ఆ అంకెమీద వొంద రాసీ, ఓన్ క్లోజింగుమీద ఏభయి రాసీ...

మలా రాత్రికి నా కుక్కదర్దు....” అన్నాడు చందూలాల్.

“ఆసేత్తోనే నాకో పదిరూపాయల్లాసే రల్లుడూ లాల్జీ యిచ్చేసారు....” అన్నాడు గురువులు కొత్తపిట్టకోసం గాలిస్తూ.

“పదీలేమ భాయి.........అయిదు రూపాయలిక్క సెస్కో....” అన్నాడు చందూలాల్ మొహం ముటముట లాడిస్తూ.

“చావుకి పెద్దేగానీ లంఖణానికి దిగద”న్న సంగతి యెరిగినవాడు కాబట్టి—

“రేపంకెచూసి ఆ అయిదు రూపాయల్నేవెంటూ మీ రియ్యప్పోండి సెప్తాను” అన్నాడు గురువులు.

“అంకెరావాల్కానీ గురువుల్భాయీ నీకివ్వాల్సిన నజరానా మరిచీపోతాం” అంటూ చందూలాల్ రిక్షా ఎక్కేసేడు.

“నజరానా.... మూడు సుట్లు తిప్పి సేతిలో ఎట్టే ముక్కాన్దబ్బు వీడిచ్చే నజరానా....” అంటూ విసుక్కుంటోన్న గురువులి కళ్ళల్లో చిక్కుకున్నాడు సత్తిరాజులు.

“ఏట్రోరి సత్తిరాజులూ.... పక్కని మడిసంత మడిసిని కూకునుంటే, సూసీ సూడ్నట్టూ వుసార్గెల్లిపోతున్నావు........ ఎటంత గట్టి అంకె వుందేట్రా జోబీలో....” అంటూ గురువులు పలకరించేసరికి—

గురువుల్ని చూసినా చూడనట్లు సరాసరి గారీసు దగ్గర కెళ్ళిపోతోన్న సత్తిరాజులు-చొక్కా పట్టుకు లాగితే నిలబడిపోయినట్లు ఆగిపోయి—

“నెదు మాఁగా....ఇయాల నైట్ డ్యూటీ... బేగెలాల....అందుకేదో వొకటా దేసెలోప్పెదాఁవనీ....” నసిగాడు.

సత్తిరాజులు పోర్టులో గ్రేడు వన్ టగ్ మాష్టరు. జీతం వెయ్యికిపైనే. చేతికొచ్చే దెప్పుడూ అయిదు వందల్లోపే. ఆ వొచ్చి నయిదు వందల్లోనూ వో వందకిపైనే ఆడేస్తాడు బ్రేకెట్టు. మూడు రూపాయిలకి తక్కువాడ్డెప్పుడూ. అప్పుడప్పుడు గెలుస్తూ వుంటాడు. లెక్కతేలిస్తే మట్టుకు గెలిచిందానికన్నా ఆడిందే ఎక్కువవుతుంది ఏ నెల్లో చూసినా.

“పదిగంటల కెల్లాల్సిన డూటీకేటం తైరానా... ఎల్దువులే... నివ్వొక్కడివే డూటీ సేసేనన్నట్టు మహా... అయినా ఆదర బాదర గీయాలెప్పు డాడకూడ్దరల్లుడూ.... ఆ డేటవుద్దంటే తెల్లారేసరికి వొన్నప్పో వొన్దవునో అయికూకుంటాది నువ్వాడినాట.... అంసాతా....' ఇందాకల జేబులో దాచుంచిన సిగరెట్టు తీసి వెలిగించాడు గురువులు.

“అయితే సెప్పీమాఁవా ఏటాడమన్నావో?” అడిగాడు సత్తిరాజులు ఎలాగూ ఇంక వొదలడని.

“నాన్సెప్పినంకె ఆడీమనిగాదు రల్లుడూ దానర్ధం....అయినా ఇయాల నాన్సెప్పినంకెకి తిరుగునేగనుకో... ఇయాలేటి. నచ్చేరందాకా తిరుగునేదనుకో....అయినా వోపారిలా కూకో సెప్తాను... ఇయాలా..” అంటూ కథ మొదలెట్టబోతున్న గురు... అడ్డుకుంటూ “ఆడ్యూటీ కెలిపోవాల్సర్రో అంటూంటే కూకోపెట్టి కతెత్సెత్తానంటా



తిరిగి వాడుకొనుటకు వీలైన, ఆకర్షణీయమైన కంటైనరు.

చేటి ?" వినుకున్నాడు సముద్రాలు.

"అయితే సముద్రాలూ....సత్తిరాజులికి మనంకెమీద అయిదు రూపాల్రాసీమీ...." అన్నాడు గురువులు గ్రహించేసి.

"అంత గట్టిగుండేటిమాఁవా అంకె.... అయినా అయిదు రూపాయలొద్దుమాఁవా అసలే డబ్బుల్లేవ్వూ" అంటోన్న సత్తిరాజుల్ని చూసి "వోర్నే సెప్పినంతాన్రా.. అడపోతే తెల్లార్లేసేడుస్తావు మలా ...." కసురుకున్నాడు గురువులు. మనసులాగీసిన సత్తిరాజులు "రాసీ సముద్రాలూ.... ఏటయితదే అవుతుంది అయిదురూపాయల్రాసీ.... అలగే ఆడికో అద్దరూపాయి కూడా రాసీ" అన్నాడు మళ్ళా అడిగించుకోవడంవెందుకని.

"అదిరల్లుడూ అలగుండాలి దైర్యంవంటే.... అంకె బలంగున్నప్పుడు జంక కూడదురా.... ఏయి రెండు బీడీలూ...." అంటూ డ్యూటీలోకని కొనుక్కున్న కట్టలోంచి రెండు బీడీలు తీసుకునిగాని వొదల్లేదు సత్తిరాజుల్ని గురువులు.

——టైము అప్పటికే ఏడున్నర దాటడంతో ఆడ్డానికొచ్చే మనుషులజోరు హెచ్చవడంతో గురువులికి ఊపిరి సలపటంలేదు. గురువులగ్గర బలమయినంకేదో వుందని నిముషాలమీగ వూరు వూరంతా పాకిపోవటంతో జనం ప్రవాహంలా వస్తున్నారు. ఇన్కమ్టాక్స్ ఆఫీసులో పన్జేస్తోన్న సుబ్బారావూ, బంగారంకొట్టు గున్నయ్య బ్రహ్మంగారూ, కలెక్టరాఫీసు గుమాస్తాలూ, సినిమా హాళ్ళ ప్రొప్రయిటర్లు పంపించిన గేట్మెన్లూ, పేరు బయటపడకుండా అజ్ఞాతంగా ఆడుతోన్న పెద్ద మనుష్యుల నౌఖర్లూ — జాతి మత కుల విచక్షణ లేకుండా, అంతస్థుల తారతమ్యం లేకుండా వొచ్చే జనంతో సముద్రాలి బడ్డీ పేరుబడ్డ దేవుడి గుడిలా కళకళలాడుతోంది.

చుట్టలు, సిగరెట్లు, బీడీలు ఏదిపడితే అది వొచ్చిన జనం దగ్గర తీసుకుని కాలుస్తూ, గ్రూపు కొక్కొక్కక్లాసు పెట్టేసి, విడివిడిగా మొహాల్నిపట్టి ఎవడికి వ్వాల్సిన సలహాలు వాడికిచ్చేస్తూ, వాళ్ళ దగ్గర్నుంచి కన్సల్టింగు ఫీజులు చాకచక్యంగా వడికేస్తూ, త్రివిక్రముడిలా విజృంభించాడు వోగంటసేపు గురువులు. నెలాఖ్రోజున అంతముమ్మరంవైన బేరం ఈ మధ్యకాలంలో ఎప్పుడూ కళ్ళజూడకపోవడంతో సముద్రాలికి బహు ముచ్చటగా వుంది. అప్పటి కప్పుడే నాలుగు సార్లు పంపించాడు బొత్తులకొద్దీ చీట్లని కంపెనీకి. ఎనిమిదిన్నర కావటంతో రష్ తగ్గింది. అయిదోసారి చీట్లు పంపించడానికి సముద్రాలు సిదపడేసరికి - కంపెనీ నుంచి ప్రొప్రయిటరు తోలసిన మనిషి పరుగున వొచ్చాడు రొప్పుకుంటూ. అర గంట ముందే వొచ్చిన మనిషిని ఆశ్చర్యంగా చూస్తూ—

"ఏట్రా తవుడూ అరగంట ముందే పారొచ్చినా వేట్సంగతీ ?" అడిగాడు సముద్రాలు.

"త్రీ వొన్నింక రాయొద్దనీసాడు సావుకారు ... ఇప్పటికయిన చీట్లట్టుకొచ్చిమన్నాడు" అన్నాడా వొచ్చిన మనిషి. ఆ మాటవిని చిద్విలాసంగా నవ్వుకున్న గురువులు—

"ఇయాలేంవుందిరా మీ సావుకార్సంగతీ... మూర్డొజులొర్సగా మూడ్సెర్వ్వీల్నికళ్ళ తాగాలని సెప్పారే తవిటయ్యా మీ సావుకారికీ—" అన్నాడు ఆ వొచ్చిన మనిషితో.

"అక్రౌండు సీక్లెలిపోతన్నాయి .... ఎంతెయ్యమంటావో సెప్పే ...లేకపోతే ఆ తర్వాత నువ్వు తాగాల్సొస్తుందామూడు సెర్ల నీళ్ళూనూ" అన్నాడు సముద్రాలు గురువుల్తో, రాసిన చీట్లమీద డబ్బు లెక్కకడుతూ.

'మన కలెక్ష నెంతయిం దేటియాల?' అప్పటికే మనసులో లెక్కకట్టి వుంచుకున్న గురువులు అడిగాడు.

"ముప్పయ్యారూ ... సరిపోయిందా.." అన్నాడు సముద్రాలు ఆ లెక్క రాసుంచిన చీటీ తీసిస్తూ.

"సిటీ ఎందుకురల్లుడూ... నీలెక్కకీ, నా లెక్కకీ తిరకాసెప్పుడుండదుగానీ...పాతిక రాసీ...." అన్నాడు గురువుల్లేస్తూ.

"పాతికేటి మాఁవా....ఇయాల్నొంటరెంతో అంతా రాసీయాల" అన్నాడు గౌరీసు హుషారుగా.

"నీ నోటి సలవలాక్కానీయరల్లుడూ.. ఏసీ అంకే డబ్బాత్రీవన్నే ఏసీరా సముద్రాలూ....అలగేసిన్నల్లుడికో రూపాయిది రాసీ....అందరికీ నాను సలాలిత్తే ఆడు నాకు సలాలిసన్నడు...." అన్నాడు గురువుల్నవ్వతూ.

చీట్లు పట్టుకెళ్ళడానికొచ్చిన తవిటయ్య కూడా ముచ్చటేసి తనూ వో రూపాయిది రాయించేసుకుని ఆ చీట్లల్లో తన చీటీ కూడా కలిపేసుకుని పట్టుకెళ్ళి పోయాడు.

మిగిలిన నాలుగు రూపాయల్లోనూ వో రూపాయివి చుట్టల్తీసుకుని - "సపాతీ తినేసొస్తన్నల్లుడూ" అంటూ మూడు రూపాయలూ జేబులో వేసుకుని బయలుదేరాడు గురువులు పూర్ణా మార్కెట్టు సేపు. మోతీ మహలు చేరేలోపున దార్లో అడ్డేసిన ఆరు చోట్లా లక్ష్మీవారందాకా త్రీవాన్ అన్ ఫేంజవతూ రావడనికి గల సకల నిదర్శనాలూ అందుకుగల సాక్ష్యాధారాలూ, చిన్న చిన్న ఉపన్యాసాల ధోరణిలో ఇచ్చుకుంటూ వొచ్చేసరికి వోపెనింగు వొచ్చే వేళయి కూర్చుంది.

———చపాతీలు తిని, టీ యిలా నోటిదగ్గర పెట్టుకున్నాడో లేదో, హోటలు బయట పెద కోలాహలం చెలరేగింది. "ఓపినింగొచ్చినా దన్నమాట" మనసులో అనుకున్నాడు గురువులు "ఏటొచ్చినాదో"ని కూడా అనుకున్నాడు. అలానుకున్నప్పుడు గురువులి గుండెల్లో చెలరేగిన చిన్న అలజడి—టీ ఆత్రంగా తాగడంలో కనిపిస్తోంది!

"మాఁవా 'త్రీ' వోపినింగొచ్చినాది" ఎక్కణ్ణుంచొచ్చాడో— తారాజువ్వలా దూసుకొచ్చి—అన్నాడు గౌరీసు.

కుదుటపడ గుండెతో, నిర్వికారంగా ఓ నవ్వు నవ్వాడు గురువులు వేదాంతిలా.

"కంపెనా కొడుకులు బేజారెత్తిపోయి 'ఒన్' క్లోజింగు పూరిగా కటంగులో యెటీసారు...." అన్నాడు గౌరీసు.

గురువులు నిబ్బరంగా టీ తాగుతూ వొచ్చిన సర్వరుతో గౌరీసుకి టీ ఆర్డరిచ్చాడు. అప్పటికి—గురువులి సలహామీద "త్రీవాన్" ఆడిన చోటా ఆటగాళ్ళు గురువులి పక్కనచేరి అభినందించడం ప్రారంభించేరు. టీ త్రాగటం పూరిచేసి కౌంటరు దగ్గరకొచ్చి లోపల గురువులు చుట్టూచేరిన వాళ్ళల్లో ఒకడు సర్రున కౌంటరుమీదకి దూసుకొచ్చి గురువులి బిలు చెల్లించీసేడు. అతగాడికి తనమీద వుండుకున్న భక్తికి ముచ్చటేసి అతన్దగ్గిరే మాటకూడా పుచ్చుకుని, ముట్టించి, ఇలా బయటకు రావడంవేమీ — కాచుకున్న జనం గురువుల్ని చుట్టుముట్టేసి - తీసుకెళ్ళిపోయి, వో పేద కిళ్ళీ బడ్డీ వెనకాతలున్న ఖాళీజాగాలోనో ఓకుర్చీమిద కూర్చోబెట్టేడంవేమీ - రెప్పపాటులో జరిగిన మరుక్షణం - చుట్టుపక్కలవున్న చిన్నా పెద్దా ఆటగాళ్ళూ, ఛోటా కంపెనీల ప్రొప్రయిటర్లు చుట్టూ మూగిసేరు.

తెల్లారితే కొత్తమావాస్య. రాత్రికి అనకాపల్లిలో 'నూకాలమ్మ' గుడిదగ్గర 'తొలేలు' జాతర.

అక్కడకు వెళ్ళాలనుకున్న వాళ్ళు కూడా ఆ ప్రయత్నం విరమించేసుకుని గురువులి చుట్టూ చేరిపోయారు.

ఆరోజు "త్రీవాన్" వొచ్చి తీరడానికి చారరు నొక్కివక్కాణిస్తూ ఎలా చూపిస్తోందో - అలా వొచ్చిన్నాడు లక్ష్మీవారం దాకా అది మారకుండా రావడానికి గల

సగానికి కారణాలూ, సాక్ష్యాధారాలూ — తలపండిన అనుభవంతో గురువులు చెపోంటే - జనం కళ్ళూ చెవులూ వొప్పగించి వింటూ కూర్చున్నారు. మధ్యమధ్యలో చుట్టలొకళ్ళూ, అరటిపళ్ళొకళ్ళూ, సోడాలింకొకళ్ళూ గురువులు అడిగినప్పుడు ఆత్రంగానూ, అడగనప్పుడు బలవంతంగానూ సమర్పిస్తున్నారు. 'వాన్' క్లోజింగు ఆ రాత్రికి పూర్తిగా కటింగులో పెట్టేసినందున - బేరం అట్టేలేకపోడం వొల్లా, బడ్డీమీద గౌరీసుని కూర్చోబెట్టేసి సముద్రాలూ వెచ్చేసి గురువులు పక్కన కూర్చున్నాడు.


గురువులు మాటల్లో కనపడే 'పవరు' చూసి 'వాన్' క్లోజింగు ఆడితీరాలనుకున్న వాళ్ళు బళ్ళు వేసుకుని ఇటు అనకాపల్లి, అటు విజయనగరం బయల్దేరారాడానికి. ఆ రోజుకి చేరిన 'శ్రీవాన్' చీట్లను చూసి, వొస్తే చెయ్యాల్సిన పేమెంట్లు లెక్క చూసుకుని— బెంబేలయిపోయి, బేజారెత్తిపోయి, కాకినాడ, రాజమండ్రి, ఏలూరుల్లో 'ఫోను'మీద 'వాన్' క్లోజింగు పిచ్చెత్తిపోయినట్లు ఆడేస్తున్నారు. ఆరాత్రి పూర్ణాటాకీసు పరిసరాలో కాలం చాలా 'టెన్షన్'గా నడుస్తోంది.

——టైము పన్నెండుదగ్గరవుతోంది. మరో అరగంటలో వొచ్చేస్తుంది క్లోజింగు. ఇంతవరకూ మాటాడి మాటాడి అలిసిపోయిన గురువులు, అలా కుర్చీలోనే కాళ్ళు జాపుకుని కళ్ళు మూసుకుని - బ్రహ్మముహూరంలో తపఃదీక్షలోకి వెళ్ళే యోగుల్లా, నిశ్చలంగా, నిర్వికారంగా, నిరామయంగా తదేక ధ్యానంలో వున్నట్లున్నాడు. అతన్ని విడిచిపెట్టకుండా సముద్రాలు పక్కనే కూర్చున్నాడు. అటు జగదాంబా జంక్షన్ దగ్గర్నుంచి ఇటు రీడింగు రూము జంక్షన్ దాకా. జనం గుంపులు గుంపులుగా చేరి 'క్లోజింగ్' గురించి ఆసక్తితో, ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. పన్నెండు దాటీ దాటగానే బెజవాడకి ఫోన్ కాల్స్ బుక్ అయేయి. బెజవాడ కాల్ బుక్ చేశారని వినగానే గుంపులు గుంపులుగా చెల్లాచెదురుగా వున్న జనం వొక్కచోట పోగయ్యేరు అందరి మొహాల్లోనూ ఆందోళన... ఆశ.... భయం! గురువులు నిర్వికారంగా నిశ్చల సమాధిలో వున్నట్టున్నాడు

ఫోనోపాటు అందరి గుండెలూ గణగణలాడేయి.

లోపల్నుంచి ఫోన్లో మాట్లాడొచ్చిన మనిషి "వాన్నొచ్చింది" అన్నాడు దిగాలుగా.

ఆ నోట్లోంచొచ్చిన, ఎన్నో నోళ్ళ



సంక్రాంతి ముగ్గు  చిత్రం : బోనేపల్లి జాన్సీలక్ష్మి, తెనాలి

మీదుగా గురువులి చెవిలో కొచ్చిన 'వాన్' అనే ముక్క వినడమేమీ- గురువులు వొక్క ఉదుట్లో లేచి పక్కబడ్డీలో అమ్మకానికుంచిన కొబ్బరికాయల్లోంచి మూడు కాయలు తీసి వొకదాని తర్వాత వొకటి వరసగా జనం చూస్తోండగా రోడ్డుమీద వేసి పగలగొడుతూ—

"వారే సున్నంతో రోడ్డుమీద శ్రీవాన్ ముగ్గెటంత్రా.... సచ్చేరందాకా సెరిగిపోనంత దిట్టంగెటండ్రా...." చాలా ఆవేశంగా అనీసరికి జనం చప్పట్లతో, కేరింతలతో, ఆ ప్రదేశం అంతా మారుమోగిపోయింది.

"రేపు తొమ్మిదోగంటకల్లా పేమెంటు నా సేతిలెట్టాలల్లుడూ.... అదట్టుకుని బెజివోడ దాకా ఆడుకుంటుంటెలాల్నేను .. ఇన్నాళ్లకి దొరికేరు బెజవాడోళ్ళు.... మూడెన్రువ్వేల్నిళ్లు తాగిస్తాన్నూడాలని ...." తీక్షణంగా అంటోన్న గురువుల్ని చూసి, ఆ మొహంలో వెలిగే కాంతిచూసి, లక్ష్మివారందాకా శ్రీవాన్నొచ్చి తీరడం ఖాయం అనుకున్న జనం నిబ్బరంతో సాగిపోయారు. సముద్రాన్ని వెంటేసుకుని, కనకమహాలక్ష్మి గుడి వేపు దారితీశాడు. గురువులు.

——మర్నాడు తొమ్మిదో గంటకల్లా పద్దెనిమిదొందలరవయి రూపాయలు పేమెంటందుకున్న గురువులు- కొత్తబట్టలు కొనుక్కుని తొడుక్కుని, కనకమహాలక్ష్మి గుడికెళ్ళి మువ్వయ్యొక్క కొబ్బరికాయలు కొట్టి, సముద్రాలి సంపతులకి బట్టలు పెట్టి, వాళ్ళ పిల్లలకి మిఠాయి కొనిచ్చి, గౌరీసుకి ఎలక్ట్రికల్ వైరింగ్ కిట్ కొనుక్కోమని వోఎం రూపాయలు బక్షీషు ఇచ్చి, ఎరిగున్న ముఖాల్నన్నిట్నీ పేరుపేర్నా పలకరించి 'శ్రీవాన్' తప్ప మరో టాడొద్దని మరీ మరీ హెచ్చరించి, "అల్లుడూ మర్నాన్నెల్తన్నాను .... నా నిరిగొచ్చేటప్పటికి జెండాసెట్టు దగ్గిర మన మేడల్ని బేరం పెట్టించాల్నువ్వు...." అంటూ గొప్ప ధైర్యంతో, నిశ్చలమైన ఆత్మ విశ్వాసంతో, బెజవాడవరకూ జైత్రయాత్ర చేసుకురావడానికి బయలుదేరాడు గురువులు.

——అనకాపలి, తుని, కాకినాడ, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరులో

వందకి పైనే "త్రీవాన్"మీద కాసుకుంటూ బెజవాడ చేరేసరికి రాత్రి ఎనిమిది దాటింది. బెజవాడలో బ్రాకెట్టు రాసున్న బడ్డీలన్నిట్లోనూ ఆదీసరికి యెవడో గజాట గాడు పూళ్ళోకొచ్చి 'త్రీవాన్' మీద విప రీతంగా ఆడేసున్నాడన్న విషయం నిము షాలమీద పూరంతా పాకిపోయింది. తొమ్మిది కొట్టేసరికి నెంబరు తీసేచోటికి చేరుకున్న గురువుల్ని చుట్టుముట్టారు జనం. ఓపెనింగు 'మూడు' రావటంతో వాళ్ళందరి హర్షధ్వానాలమధ్యా చిరునవ్వు నవ్వుకుంటూ బయలుదేరి ఓ హోటల్లో భోంచేసి ఆ పక్కనేవున్న ఓ లాడ్జింగులో రూం తీసుకుని లోపలకొచ్చి మంచంమీద కూర్చుని చుట్ట ముట్టించేసరికి — అతన్ని విడిచిపెట్టకుండా వెంటవొచ్చినవాళ్ళు చుట్టూమూగి, రకరకాల ప్రశ్నలతో సందే హాలతో గురువుల్ని పూపిరాడనియ్యలేదు. వాళ్ళవాళ్ళ ప్రశ్నలకు జవాబులిస్తూ. ఎవళ్ళ సందేహాలు వాళ్ళకి నివృత్తి చేస్తూ. త్రీవాన్ అన్ ఛేంజవటానికి గల కారణా లను సహేతుకంగా వివరించేసరికి. అక్కడున్న ఆటగాళ్ళందరికీ ఆకాశం నుంచి దిగొచ్చిన దేవుడయిపోయాడు గురువులు. టీలు. అరటిపళ్ళు. చుట్టలు. బీడీలు యెవళ్ళకు తోచిందివాళ్ళు సమ ర్పించుకుంటున్నారు. అలా వొచ్చిన వాళ్ళు వొస్తూనే వున్నారు. లాడ్జి వోనరు కూడా యిదంతా ముచ్చటేసి గురువుల్ని సింగిల్ రూమ్‌నుంచి మార్పించి డబుల్ రూముకి చేర్చాడు. టెమ్ పన్నెండవుతోం దనగా—"క్లోజింగు తీస్తారు. పోయి చూసొద్దాం రాండి" చుట్టూవున్న వాళ్ళల్లో వొకాయన అన్నాడు గురువుల్తో.

"ఏటొస్తాదోని అనుమానంవుంటే యెలాల... నేను రాను ...మీరెల్లండి ..." అన్నాడు గురువులు విశ్రాంతిగా మంచం మీద వాల్తూ. ఆత్రం అణుచుకోలేనివాళ్ళు పరుగెత్తుకెళ్ళారు. కొంతమంది గురువు ల్నంటిపెట్టుకు నుండిపోయారు.

——ఇలా వెళ్ళిన జనం మరో పది నిమిషాలకి అలా పరిగెత్తుకు వొచ్చి "వొన్నే వొన్నొచ్చింది గురువుల్గారూ.." అంటూ గురువుల్ని కుదిపేస్తూ అనేసరికి. సర్వం ఎరిగిన అంతర్యామిలా వో చిరు నవ్వు చిందించి లేచాడు గురువులు. ఆ తెల్లవార్లూ మరి కంటిమీద కునుకు లేదు. వొటికి విశ్రాంతి లేదు గురువులకి. పేల మీద నెంబర్లు పడే కంపెనీ ప్రతి హో టల గుండెల్లో వొణుకు ప్రారంభ మయింది మూడోసారికూడా త్రీవాన్ రావడానికి గల నిదర్శనాలని గురువులు చెప్పగా వినడానికి స్వయంగా పరిగెత్తు కొచ్చి వినేసరికి. కాళ్ళూ. చేతులూ ఆళ్ళేదు -ముచ్చెమటలు కమ్మేశాయి

——తెల్లవారింది. కొత్త వెలుగులు జిమ్ముకుంటూ కొత్త సంవత్సరం ప్రవే శించింది. కొత్త జీవితానికి ఉరకలు వేస్తూ 'పేమెంటు' అందుకోడానికి బయలుదేరిన గురువులు - చుట్టూ వున్న అభిమానుల్ని చూసి చిర్నవ్వుతో—

"పేమెంట్లందుకునొస్తానేరాత్రికియిస్నా- దమ్మున్న ఏ కింపెనీ నా కొడుకయినా పడ్డానంటే అందుకున్న పేమెంటంతా అడ్డగిరేకాస్తాను. ధైర్యంవుంటే నాతో నిలబడ్డానికి సిద్ధంగుండమనండి-" అంటూ టాక్సీలో బయలుదేరాడు విజయ గర్వంతో, ఉగాదినాడు బ్రాకెటాటకి సెలవు. వెళ్ళిన చోటల్లా పేమెంటతో పాటు అభినందనల పరంపరలందు కుంటూ — సుమారు ఏభయి వేల రూపా యలు మోసుకు తిరిగొచ్చాడు గురువులు రాత్రి ఎనిమిదాటాక బెజవాడకి.

——వెళ్తా వెళ్తా ఉదయం గురువులు చేసిన ఛాలెంజి ఆ నోటా ఈ నోటా పాకి పాకి, వెయ్యి రూపాయలకి తక్కువ ఏ నెంబరుమీదా ఆటపడని వో బడా మార్వాడీ చెవిలో పడేసరికి 'దమ్ముంటే కాయమనెంత కాస్తాడో'ని తిరుగుసవాలు పంపించాడు. గురువులు తిరిగొచ్చిన వేళకి 'దమ్మనా మొనగాడిని' చిరునవ్వుతో జవా బిచ్చాడు గురువులు. తెలారేసరికి కోడి పుంజులు తలపడాయి మాటామాటా పెరి గింది. 'దమ్ముంటె నువ్వింకో నెంబరు కవరింగాడకూడదు' అన్నాడు మార్వాడీ. 'కవరింగాడే పిరికిపందలెవరేరిక్కడ — ధైర్యంవుంటే నా దెబ్బతో నా నెంబరు గాని; దానోపెనింగూ క్లోజింగులు కాని నువ్వాపకూడదు' అన్నాడు గురువులు ఛాలెంజీ అంటె ఛాలెంజి అన్నారిద్దరూ. వొచ్చిన ఏభయివేలూ వొడ్డేసేడు గురు వులు. 'నలభయిరెటేస్తాను' అన్నాడు మార్వాడీ 'పాతిక రెటేచ్చినా చాలు — పేమెంటుసిద్ధంగుంచు'అన్నాడుగురువులు ఆ దెబ్బకి అటు శ్రీకాకుళంనుంచి ఇటు అనంతపురం నెల్లూరులదాకా బ్రాకెట్టు ప్రపంచంలో గొప్ప సంచలనం చెల రేగింది. మొత్తం ఆంధ్రదేశంలో 'త్రీ వాన్'కి పాతికరెట్లకి దింపేశారు అన్ని కంపెనీలు. చిన్నా పెద్దా ఆటగాళ్ళందరికీ ఊపిరి బిగుసుకుపోయింది. "ఓపెనింగు చూసి బనతా ఎక్కుతాను రాత్రికి- మా ఆల్లుడు సముద్రాల్ని తీసుకొస్తాను పేమెం టుకి" అన్నాడు గురువులు ఓపెనింగు తీసేవేళకి 'మూడు పేకముక్కలు' గురు వున్నా తియ్యమన్నారు.' ఎవుళ్ళీ నా వొచ్చిది మూడే' అన్నాడు గురువులు తను తియ్యకుండా అక్కడ మూగినవాళ్ళలో వో చిన్నకుర్రాడిచేత తీయించాడు. కుర్రాడు కలిపిన పేకలోంచి మూడుసార్లూ మూడు ఆసులు తీశాడు. ఓపెనింగు '(మూ)డు' అని డిక్లేర్ చేసేసరికి - గురు వుల్ని ఆకాశానికెత్తేశారు చుట్టూవున్న జనం. మళ్ళీ గురువులు చిన్న చిర్నవ్వు నవ్వి—పదిగంటలకు బయలుదేరే జన తాలో కూర్చున్నాడు. "రేపురాత్రి కిదే బండ్లో బయలేరొస్తాం నేనూ మా యలు డూనూ" అంటూ అందరికీ వీడ్కోలు చెపుతూంఢగా రైలు కదిలింది విశాఖ పట్నంవేపు....

— చీకటను చీల్చుకుంటూ, కాంతి రేఖలు భూమ్మీదవెలుగు ముగ్గులుపెట్టేవేళ అప్పుడే బడ్డీతెరిచిన సముద్రాలు, శుక్ర వారం కనకమహాలక్ష్మిపూజ ముగించి, అమ్మవారి పటంముందు భక్తిపారవశ్యంతో కళ్ళుమూసుకుని ధ్యానించుకుంటున్నవేళ-

"రొండు చుట్టలిలా వొడీయలుడూ" అన్న గురువులి గొంతువిని. ఉలిక్కిపడి కళ్ళు తెరిచి చూశాడు సముద్రాలు.

"నేనే అలుడూ గురువుల్ని.... ఏటలా దెయ్యాన్నూసినట్టా సూపు .. వొస్తవునొస్తె సుడుసుల్నచ్చిపోతారనుకున్నావేటి .. రాకె క్కడికి పోంలుడూ.... రొండ్రోజులన్ సేంజయి మూడో రోజుకి వొస్తదనయి పోయిందెందుకెరుగుదునా? మద్దిలో రోజు కెలొచ్చి ఆట నెదుర్దా అనుకూల గయింది... సరే.మూడ్రోజులూ త్రీవాన్ అన్ సేంజవుతూ రావాల నేను నా పాణా లొగ్గాల... సుట్టముక్కెదేస్తూ నీ సేతి సుట్ట కాల్సక నాలిక పీక్కుపోతందీ...." అన్నాడు గురువుల్నవ్వుతూ

ఆ నిబ్బరం చూసి మతిపోయింది సము ద్రాలికి.

.... మూడు రోజులూ వరసగా "త్రీవాన్" అన్ ఛేంజయిందోలేదో తెలీదు గాని, "అన్ ఛేంజయి తీరుతుందన్న" ఆశ మాత్రంగురువులుమనసులో"అన్ ఛేంజి" గానే ఉంటుంది ఆశల సాలెగూడు అంత లమయింది ప్రపంచంలో మరొటిలేదు. అందులో చిక్కుకోడంవేగాని బయటకు రావడంచేతగాని అభిమన్యులాటి గురువులు కోకొల్లలుగా బ్రతికున్నంతకాలం! ●